# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 21, మార్చి 2026


## పాఠశాలలు, వసతి గృహాల్లో కలెక్టర్ తనిఖీ

● గ్యాస్ సరఫరాపై సమీక్ష



**నిర్మల్, మార్చి 20, ప్రభాతవార్త:**

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు అసత్య వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ (కాండ్లి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, పరీక్షలను ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రాయాలని ధైర్యం చెప్పారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రభుత్వ వసతి గృహాలకు గ్యాస్ సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో విద్యార్థుల అవసరాలకు సరిపడా సిలిండర్ల నిల్వ ఉండాలని, ఏజెన్సీలు సమయానికి సరఫరా చేయాలని ఆదేశించారు. సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తహశీల్దార్లకు సమాచారం అందించాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదని, బుక్ చేసుకున్న నిర్ణీత గడువులోపు డోర్ డెలివరీ చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఈవో భోజన్న, తహశీల్దార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## మహిళల అక్రమ రవాణా కేసు గుట్టురట్టు

**బెజ్జూర్, మార్చి 20, ప్రభాతవార్త :**

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో మహిళల అదృశ్యం కేసు నమోదయింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతు ఉండగా,ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు బాధితులను మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గుర్తించి సురక్షితంగా తీసుకువచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సిఐ సంతోష్ కుమార్ తెలిపారు. బాధిత మహిళలు చెప్పిన వివరాల ప్రకారం ఇద్దరు యువతులు ఉద్యోగం కోసం మంచిర్యాల ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో కిష్టంపేట్ గ్రామానికి చెందిన ముదిమాడుగుల ప్రశాంత్ అతని భార్య సవిత వారికి పని కల్పిస్తామని చెప్పి పరిచయం పెంచుకుని,మహారాష్ట్రకు చెందిన మహేష్ అనే వ్యక్తి సహాయంతో డబ్బు కోసం ఇతర ప్రాంతాల వారితో వివాహాలు జరిపిస్తామని ప్రలోభపెట్టారు. బాధితులు అంగీకరించకపోవడంతో నిందితులు కుట్ర పన్ని. వారిని బెదిరించి బలవంతంగా రైలులో ఎక్కించి మధ్యప్రదేశ్‌కు మిగతా 2లో..

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

● బీజేపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా రైతు భరోసా నిధులు, పంటల బీమా పథకం వంటి కీలక హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని, ఆశించిన దిగుబడులు రాకపోవడంతో పాటు గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే రైతులకు భరోసా కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా రైతు భరోసా కింద ఎకరానికి సంవత్సరానికి రూ.15,000 చొప్పున పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతు రుణ మాఫీ 2 లక్షలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం

● విద్యాలయ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి ● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం రోజున సవివరంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా సమీక్షించిన ఆయన, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక కీలక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఆ లక్ష్యానికి అనుగుణంగా పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించాలంటే నాణ్యమైన భవనాలు, తరగతి గదులు, అవసరమైన సౌకర్యాలు సమయానికి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు.

**పాఠశాలల తనిఖీలు విద్యార్థుల అభ్యాసన స్థాయిపై దృష్టి...**

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. తరగతి గదుల్లో బోధన విధానాన్ని గమనించి, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థులతో మమేకమై వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, బోధనలో సృజనాత్మక పద్ధతులను మిగతా 2లో..


## అగ్నివీర్ నియామకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

✪ జిల్లా ఎస్పీ నితికా పంత్



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :**

ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామకాలు-2027 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని దేశ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ఫిబ్రవరి 13, 2026 నుండి ఏప్రిల్ 1, 2026 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అగ్నివీర్ పోస్టులు జనరల్ డ్యూటీ (జీడి), మహిళా మిలిటరీ పోలీస్, ట్రేడ్స్‌మెన్ (10వ, 8వ పాస్), క్లర్క్/స్టోర్ కీపర్ (టెక్నికల్) విభాగాల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. జనరల్ డ్యూటీ, మహిళా మిలిటరీ పోలీస్ పోస్టులకు 10వ తరగతి అర్హత ఉండగా, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు 8వ, 10వ తరగతి విద్యార్హత అవసరమని, క్లర్క్/స్టోర్ కీపర్ పోస్టులకు ఇంటర్మీడియట్‌లో కనీస మార్కులు, ఇంగ్లీష్, మ్యాథ్స్/అకౌంట్స్‌లో ప్రత్యేక అర్హతలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వయస్సు పరిమితి 17 నుండి 22 సంవత్సరాల మిగతా 2లో..

# మహిళల అక్రమ రవాణా కేసు గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లారు. అక్కడ,వారి ఇష్టానికి విరుద్ధంగా అక్కడి వారితో అమ్మాయిల మేన మామ అని చెప్పి దేవాలయంలో వివాహాలు జరిపించి, ఒక్కొక్కరి భర్త వద్ద నుండి రూ.2,50,000/ చొప్పున డబ్బు తీసుకుని మొత్తం రూ.5,00,000 అక్రమంగా లాభం పొందినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. అనంతరం బాధితులను అక్కడే వదిలి నిందితులు పరారయ్యారన్నారు. ఈ కేసులో సంబంధం ఉన్న ముగ్గురు ప్రధాన ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుండి బాదితులకు సంబందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఆధార్ కార్డులు,పాన్ కార్డులు, బ్యాంక్ పాస్ బుక్స్ వంటి పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మరొక నిందితుడైన మద్యప్రదేశ్ కు చెందిన రాహుల్ ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బెజ్జూర్ ఎస్ఐ సర్తాజ్ పాషా పాల్గొన్నారు.

## అగ్నివీర్ నియామకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మధ్యగా నిర్ణయించబడిందన్నారు. అదేవిధంగా క్రీడాకారులు, గిరిజన, హిల్ ప్రాంతాల అభ్యర్థులకు ఎత్తు, బరువు వంటి అంశాల్లో సడలింపులు కల్పించబడతాయని ఎస్పీ పేర్కొన్నారు. యువతలో అవగాహన పెంపొందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు చేపడుతూ, సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సహాయం అందించేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ద్వారా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

## జీఎం కార్యాలయ ఉద్యోగులు అందరికీ ఆదర్శంగా ఉండాలి

- ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలి
- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్
- జీఎం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

నస్పూర్, మర్చి 20, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఉద్యోగులు సింగరేణి వ్యాప్తంగా ఉన్న సిబ్బంది అందరికీ ఆదర్శంగా నిలవాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం ఆయన జీఎం కార్యాలయ ప్రాంగణంలోని అన్ని విభాగాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇంజనీరింగ్, ఐఈడీ, క్వాలిటీ, ఐటీ, ఫారెస్ట్, ఫైనాన్స్, ఎస్టేట్స్, సర్వే సెక్షన్లను సందర్శించారు. మొదటి అంతస్తులోని పర్సనల్, సివిల్, పర్చేస్ విభాగాల్లో ఇన్స్పెక్షన్ చేశారు. ఉద్యోగుల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన విభాగాధిపతులతో కార్యకలాపాలపై ఆరా తీశారు. ఏరియా పరిధిలోని గనులు, కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జీఎం కార్యాలయ ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలని మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉద్యోగుల సంక్షేమ వ్యవహారాల్లో పర్సనల్ విభాగం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. సివిల్, ఎస్టేట్స్, ఫైనాన్స్ వంటి అన్ని విభాగాలు తమ విధులను సకాలంలో పూర్తి చేయాలని జీఎం సూచించారు. జీరో పెండెన్సీ లక్ష్య సాధన దిశగా అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణారావు, డీజీఎంలు రాజన్న, ఎస్. అనిల్ కుమార్, లా ఆఫీసర్ మల్లేష్, ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

అనుసరించాలని సూచించారు.



### పౌష్టికాహారం, త్రాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి...

విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. శుద్ధమైన త్రాగునీటి సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, తరగతి గదులు, వంటగదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

### గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష...

గ్రామంలో అమలు జరుగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మురుగు కాలువల నిర్మాణం, శుభ్రత నిర్వహణ, చెత్త సేకరణ విధానాలు సక్రమంగా అమలు కావాలని సూచించారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, ఉపయోగకరమైన వ్యర్థాలను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్లకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు.

### నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్ల పరిశీలన...

మండల కేంద్రంలోని నర్సరీలను సందర్శించిన కలెక్టర్, మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమయానికి నీరు అందించి మొక్కలను పరిరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం కీలకమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి చెత్త వర్గీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, పర్యావరణానికి హాని కలగకుండా వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని సూచించారు.

### గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన - విద్యార్థుల సంక్షేమం పై దృష్టి...

మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించారు. విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన స్థాయి, మధ్యాహ్న భోజనం నాణ్యత, వసతి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.

### మధ్యాహ్న భోజన నాణ్యతపై సూచనలు...

మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సిబ్బంది ఆరోగ్య, శుభ్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సూచించారు.

### విద్యార్థుల నమోదు పెంపుపై దృష్టి...

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. డ్రాప్‌ఔట్ విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకురావడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

### ఇతర పాఠశాలల తనిఖీలు...

అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. బోధనలో లోపాలను గుర్తించి ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆయన కళ్ళు సజీవం..

## - ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన ఆయిల్ల మల్లేష్ నేత్రదానం



బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త

బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన ఆయిల్ల మల్లేష్ (55) గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడం గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయిన ఈ సమయంలో వారు తీసుకున్న గొప్ప నిర్ణయం సమాజాన్ని కదిలించింది. మల్లేష్ మరణించినప్పటికీ, ఆయన కళ్ళు మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేలా కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు రావడం మానవతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. మల్లేష్ బావమరిది, జనహిత సేవా సమితి సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్ ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. మనిషి మరణించిన తర్వాత కూడా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపగల గొప్ప అవకాశం నేత్రదానం ద్వారా సాధ్యమవుతుందని ఆయన చెప్పడంతో, కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖాన్ని పక్కనపెట్టి సమాజహితం కోసం ముందుకు వచ్చారు. మల్లేష్ భార్య ఆయిల్ల పద్మ, కుమారుడు సాయి తేజ, కుమార్తెలు ప్రీతి, ప్రియాంకలు కలిసి నేత్రదానానికి అంగీకరించారు. వారి ఈ నిర్ణయం గ్రామస్థులను కదిలించడమే కాకుండా అందరిలోనూ ప్రేరణను కలిగించింది. సదశయా ఫౌండేషన్ సహకారంతో ఎల్.వి. ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది ప్రదీప్ సమయానికి చేరుకుని మల్లేష్ నేత్రాలను స్వీకరించారు. వైద్య నిబంధనల ప్రకారం మరణించిన 8 గంటల లోపు కళ్లలోని కార్నియా పొరను సేకరించడం ద్వారా ఈ ప్రక్రియ పూర్తయింది. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ, తీవ్ర దుఃఖంలోనూ సమాజానికి ఉపయోగపడేలా తీసుకున్న మల్లేష్ కుటుంబ నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. జనహిత సేవా సమితి తరపున ఇది 13వ నేత్రదానం కార్యక్రమమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అయన మరింతగా మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ఇవ్వడమే కాకుండా, వారు మళ్లీ ఈ ప్రపంచాన్ని చూడగలుగుతారని తెలిపారు. అలాగే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేస్తే ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. శరీరదానం ద్వారా వైద్య విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించి, భవిష్యత్తులో అనేక మంది రోగులకు చికిత్స అందించేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు అనవసరమైన అపోహలను విడిచిపెట్టి నేత్రదానం, అవయవ దానం, శరీరదానాలపై అవగాహన పెంపొందించుకుని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మరణం తర్వాత శరీరం బూడిదవుతుందే తప్ప, దానం చేస్తే మరెందరో జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అన్నారు. నేత్రదానం అనంతరం ఎల్.వి. ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధులు మల్లేష్ కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాతరి మూర్తి, జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్, గుమ్ముల చందు, కార్యవర్గ సభ్యులు భీమిని కనకయ్యతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మరణం ఒక వ్యక్తి జీవితం ముగిసినప్పటికీ, ఆయన చేసిన దానం మరో ఇద్దరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపగలదని ఆయిల్ల మల్లేష్ కుటుంబం మరోసారి నిరూపించింది. ఆయన కళ్ళు సజీవం అన్న మాటకు అర్థం వచ్చేలా చేసిన ఈ ఘటన సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# సింగరేణి పరిరక్షణలో జాతీయ కార్మిక సంఘాల వైఫల్యం

### - బలమైన కార్మిక పోరాటాల అవసరం

**బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానాలు కార్మిక వర్గంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ నేపథ్యంలో, వాటిని అడ్డుకోవడంలో జాతీయ కార్మిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని కార్మిక వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సింగరేణి వంటి ప్రజాస్వామ్య, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ విషయంలో ఈ సంఘాల వైఖరి ప్రశ్నార్థకంగా మారిందని పలువురు కార్మిక నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో కార్మికుల హక్కుల కోసం సమ్మెలు చేపట్టి, చివరికి ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకున్న చరిత్ర ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అదే పోరాట స్ఫూర్తి కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఏఐటీయూసీ వంటి జాతీయ స్థాయి సంఘాల నాయకత్వం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానాలపై స్పష్టమైన వ్యతిరేకత వ్యక్తపరచడంలో వెనుకబడిందని అంటున్నారు. సింగరేణి బొగ్గు గనుల బ్లాకులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ చిన్న కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, జాతీయ సంఘాల నాయకులు మాత్రం సింగరేణి భవన్‌లో అధికారులతో చర్చలు జరిపి, సంస్థ భవిష్యత్తుపై సమగ్ర పోరాటానికి ముందుకు రాకపోవడం కార్మికుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. సింగరేణి సీఎండీ పిలుపుతో భవన్‌కు వెళ్లిన ఈ నాయకులు, కొత్త గనుల ప్రారంభం, పాత గనుల మూసివేత వంటి కీలక అంశాలపై కేవలం స్టేటస్ రిపోర్టులను స్వీకరించి తిరిగి రావడం ద్వారా తమ వైఖరిని స్పష్టంగా తెలియజేశారని విమర్శిస్తున్నారు. ఇంకా తెలంగాణ డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన చర్చల్లో కూడా సింగరేణి బొగ్గు గనుల వేలం పాటలకు వ్యతిరేకంగా బలమైన స్వరం వినిపించలేదని, ఈ వ్యవహారంలో జాతీయ సంఘాల నాయకత్వం మౌనంగా వ్యవహరించిందని కార్మిక వర్గం అభిప్రాయపడుతోంది. ఇది సింగరేణి భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశమని, ఇలాంటి కీలక సమయంలో స్పష్టమైన పోరాట ధోరణి అవసరమని అంటున్నారు. ప్రస్తుతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు, విధానాలు దేశవ్యాప్తంగా కార్మిక హక్కులను దెబ్బతీస్తున్నాయని పేర్కొంటూ, వీటిని ఎదుర్కోవాలంటే బలమైన, ఏకీకృత కార్మిక ఉద్యమం తప్పనిసరి అని పిలుపునిస్తున్నారు. చిన్న సంఘాలు, పెద్ద సంఘాలు అనే భేదం లేకుండా అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న బొగ్గు గనుల వేలంపాటలను రాష్ట్రంలో బేషరతుగా రద్దు



చేయాలని, సింగరేణి స్వయంగా అన్వేషణ చేసిన బొగ్గు నిక్షేపాలున్న అన్ని బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిస్తున్నారు. ఇది సంస్థ పరిరక్షణకు మాత్రమే కాకుండా వేలాది కార్మికుల జీవనోపాధికి కూడా అత్యంత కీలకమని పేర్కొంటున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్‌జీకేఎస్ సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, బెల్లంపల్లి ఏరియా నాయకులు ఎన్నం శంకర్, జిల్లాల మోహన్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరింత ఉగ్రరూపంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## బెల్లంపల్లిలో యువత ఉత్సాహంతో మెగా టీ10 లీగ్ ప్రారంభం

### - బెల్లంపల్లి క్రీడా వేడుక, యువతలో క్రీడా జోష్

**బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ మైదానంలో మెగా టీ10 లీగ్ సీజన్-1 ఘనంగా ప్రారంభమైంది. క్రీడా ప్రియుల సందడిలో, యువత ఉత్సాహభరితంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక క్రీడాకారులకు ప్రతిభను చాటుకునే వేదికగా ఈ లీగ్ నిలవనుంది. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను నిర్వాహకులు ప్రకటించారు. ఫస్ట్ ప్రైజ్‌గా రూ.1,11,111/- నగదు బహుమతిని టీం ఆర్గనైజర్స్ అందజేయనున్నారు. సెకండ్ ప్రైజ్‌గా రూ.55,555/- నగదు బహుమతిని సింగరేణి నాయకుడు, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, 1969 తెలంగాణ ఉద్యమకారుడు కీర్తిశేషులు మత్తమారి రాజమల్లు జ్ఞాపకార్థం ఆయన మనుమలు మత్తమారి సందీప్, మత్తమారి వెంకటరమణ అందజేయడం విశేషం. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ఆటగాళ్లకు ప్రోత్సాహం అందించారు. సీనియర్ బాడీ బిల్డర్, క్రికెట్ క్రీడాకారుడు మమ్మద్ బాయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, పీసీసీ నాయకుడు చిలుముల శంకర్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ జాబి (ఇమ్ము) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అదనంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎం.ఏ నయీమ్, నాతరి స్వామి, చిన్నరాజం, గెల్లి రాజలింగు, భూపల్లి రాజేశ్వర్, రొడ్డ శ్యామ్, పోతరాజుల శ్రీనివాస్, మత్తమారి శ్రీనివాస్, అఫ్సర్ బాయ్, దావ రమేష్ బాబు, పీక లక్ష్మణ్, గంధం రమేష్, బండి శ్రీనివాస్, విజిగిరి రవి, లెంకల శ్రావణ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని, యువత క్రీడల్లో రాణిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. ఈ టోర్నమెంట్ ద్వారా యువకులకు మంచి అవకాశాలు లభిస్తాయని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకులను అభినందించారు. ఈ మెగా టీ10 లీగ్ ద్వారా బెల్లంపల్లిలో క్రీడా వాతావరణం మరింత ఉత్సాహంగా మారుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





## కళతో పోరాటం 46 ఏళ్ల ప్రజాసేవకు కిరీటం

### - సబ్బని కృష్ణకు ప్రతిష్టాత్మక కళారత్న నేషనల్ అవార్డు

**బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త**

46 సంవత్సరాల కళామతల్లి సేవకు గుర్తింపుగా ప్రజకళాకారుడు సబ్బని కృష్ణ కు తిరుపతి లో ఖగకళారత్న నేషనల్ అవార్డుగ్గను ప్రధానం చేసిన బహుజన సాహిత్య అకాడమీ (బి.ఎస్.ఎ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడుగా, గౌరవ అధ్యక్షుడుగా, రచయితగా, గాయకుడిగా, దర్శకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో కూడా వేలాది నాటికలను, నాటకాలను, నృత్యనాటికలను, వీధి నాటికలను, ఒగ్గు కథలను, వేలాది ప్రదర్శనలు ఇస్తూ ప్రజల భాష, ప్రజల బాణీలు తీసుకొని వాటికి ప్రజల కష్టాలను జోడించి పాలకుల విధానాలను ఎండగట్టే పాటలు అల్లి ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించి పోరుబాటలో నడిపించిన, ఈ దోపిడి పాలనకు చరమగీతం పాడాలని నిరంతరం శ్రమిస్తున్న, ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగురవేయాలని నినదించిన, విప్లవ భావజాలం మెండుగా ఉన్న, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రజానాయకుడు, ఎంసిపిఐయు పార్టీ మాజీ కేంద్ర నాయకుడు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని వర్గాల ప్రజలకు, కళాకారులకు సుపరిచితులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు కళాకారులకు కామ్రేడ్ సబ్బని కృష్ణ ను బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ ఈనెల 15వ తేదీ ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుపతి నగరంలో జరిగిన బహుజన రైటర్స్ 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో కళారత్న నేషనల్ అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో డా.యు. సుబ్రహ్మణ్యన్ బి.ఎస్.ఎ నేషనల్ జనరల్ సెక్రటరీ, జి.విష్ణువర్ధన్ బి.ఎస్.ఎ సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ, కాన్ఫరెన్స్ కన్వీనర్, ఏడు రాష్ట్రాలకు చెందిన కవులు కళాకారులు, రచయితలు గాయకులు, మేధావులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కళారత్న నేషనల్ అవార్డు అందుకున్న సబ్బని కృష్ణను కవులు, కళాకారులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందించారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు

**నేరడిగొండ, మార్చి 20, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని తేజపూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించడం జరిగింది. ప్రతి పశువుల కొట్టానికి తిరుగుతూ పశువులకు వ్యాధులు రాకుండా ఉండాలంటే ఈ టీకాలు వేయించుకోవాలని గ్రామ కారోబార్ క్రాంతి రెడ్డి తెలిపారు గ్రామంలో ప్రతి ఒక్కరు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్ పశువైద్యాధికారి జీవన్ గోపాలమిత్ర సురేష్ వి ఎల్ ఓ ఏ వెంకన్న సిబ్బంది శివప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




మాట్లాడుతూన్న మహమ్మద్ నజీర్ ఖాన్

## జాం పాఠశాలలో ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

**సారంగాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని జాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి మహమ్మద్ నజీర్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పిచ్చుకల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్రను వివరించారు. ప్రస్తుత కాలంలో పిచ్చుకలు అంతరించిపోవడానికి గల కారణాలను వివరిస్తూ, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పాఠశాల పరిసరాల్లో పడి ఉన్న వ్యర్థ ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి, వాటితో పిచ్చుకల కోసం ఆహారం, నీటి వసతి కల్పించే తొట్టిలను విద్యార్థులతో తయారు చేయించారు. వీటిని పాఠశాల ఆవరణలోని చెట్లకు కట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఉపాధ్యాయులు, ఎఫ్బీఓలు వెన్నెల, సుజాత పాల్గొన్నారు.

## సిబ్బంది సమయపాలన పాటించాలి

### - డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్

**జన్నారం, మార్చి 20, ప్రభాతవార్త**

ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలి అని డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని పరిసరాలను, సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందించే సేవలను మెరుగుపరుచుకోవాలని, వేసవి కాలం వచ్చేసింది కాబట్టి వడదెబ్బ తగలకుండా వచ్చిన రోగులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను తప్పకుండా అందచేయాలని ఆదేశించారు. అలాగే నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా టిబి, ఎన్ సిడి, లెప్రసి, మలేరియా లాంటి వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అనారోగ్యంతో వైద్యుడు మృతి



**ఇచ్చోడ, మార్చి 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శంకర్ రావు తనయుడు, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఆశిష్ కుమార్ కేంద్రే అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఆయన మృతితో ఇచ్చోడ మండలంతో పాటు జిల్లా వైద్య రంగంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శనివారం ఆయన స్వగ్రామమైన సోనాల మండలంలోని కోట గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. డాక్టర్ ఆశిష్ కుమార్ జిల్లా కేంద్రంలో అనేక మంది శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులకు విశేష సేవలు అందించి, తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నిరంతరం రోగుల సేవలో నిమగ్నమయ్యే ఆయన, చిన్న వయసులోనే మరణించడం పట్ల మండల వాసులు, తోటి వైద్యులు, మిత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి వైద్య రంగానికి తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



అక్కేపెల్లి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కేపెల్లి లక్ష్మణ్

**ఇచ్చోడ, మార్చి 20, ప్రభాతవార్త:**

మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన అక్కేపెల్లి లక్ష్మణ్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్కేపెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిన మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనలో మరింత ఉత్సాహాన్ని నింపిందని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్రం సత్యవతి కోటేశ్వర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన విఠల్‌రెడ్డి

**భైంసా, మార్చి 20, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని కామోల్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరైన సుమారు ఏడు లక్షల రూపాయల నిధుల ప్రొసీడింగ్ కాపీలను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి శుక్రవారం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రతాప్ సింగ్, శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సాయి రెడ్డి పాల్గొన్నారు.



నిధుల ప్రొసీడింగ్ కాపీలను గ్రామస్తులకు అందజేస్తున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి

# ఘనంగా టిబి ముక్త్ భారత్ అభియాన్

### టీబీ నిర్మూలన కోసం ముందడుగు - ఉచిత వైద్య శిబిరంతో ప్రజల్లో విస్తృత అవగాహన

**బెల్లంపల్లి, మార్చి 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ పరిధిలోని తాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక కార్యక్రమమైన "టిబి ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా విస్తృత స్థాయిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ప్రజల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై చైతన్యం పెంపొందించడం, ముందస్తు గుర్తింపు ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా. జాన్సీరాణి, డా. లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు, రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి క్షయవ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, చికిత్స విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. వైద్యులు వివరించిన మేరకు, రెండు వారాలకు పైగా నిరంతర దగ్గు, జ్వరము, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే క్షయవ్యాధిగా అనుమానించి వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా హెచ్ఐవి వ్యాధి గురించి కూడా ప్రజలకు వివరించి, అది ఎలా వ్యాపిస్తుంది, దాన్ని ఎలా నివారించాలి అనే అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పోస్టర్లను విడుదల చేసి ప్రజల ముందు ఆవిష్కరించారు. పోస్టర్ల ద్వారా టిబి లక్షణాలు, చికిత్స విధానం, జాగ్రత్తలు వంటి విషయాలను సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో క్షయవ్యాధి నిర్ధారణ కోసం తెమడ (స్పుటమ్) పరీక్షలు, ఛాతీ ఎక్స్ రే పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి ఉచిత చికిత్స అందించబడుతుందని, అలాగే చికిత్స



సమయంలో రోగుల పోషణ కోసం ప్రతి నెల రూ.1000 చొప్పున పోషణ భత్యం కూడా అందజేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యులు మరింతగా మాట్లాడుతూ, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి క్షయవ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతిరోజూ సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం, శుభ్రత పాటించడం, శరీరాన్ని బలంగా ఉంచుకోవడం ఎంతో అవసరమని సూచించారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభిస్తే పూర్తిగా నయం అవుతుందని, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. దగ్గు, తుమ్ము ద్వారా గాలిలో తుంపర్ల రూపంలో వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారు, పొగాకు నమిలే వారు, ధూమపానం చేసే వారిలో అధికంగా కనిపించే అవకాశం ఉందని చెప్పారు. కాబట్టి అలాంటి అలవాట్లను వీలైనంత వరకు తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం మంచిదని సూచించారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించగా, మొత్తం 21 మంది నుండి తెమడ నమూనాలు సేకరించారు. అలాగే ఎక్స్ రే అవసరం ఉన్న 84 మందికి పోర్టబుల్ ఎక్స్ రే యంత్రం ద్వారా వారి నివాస ప్రాంతాలకు దగ్గరలోనే పరీక్షలు నిర్వహించడం విశేషం. దీంతో ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా పరీక్షలు పొందగలిగారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డివిజన్ క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, ఐసిటిసి కౌన్సిలర్ జగన్మోహన్, హెల్త్ సూపర్వైజర్లు పద్మ, తార, రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం లు తిరుపతమ్మ, శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు హాకీం, యాదవ్, దేవదాసు, ఎక్స్ రే టెక్నీషియన్ పవన్, ఆశా కార్యకర్తలు కవిత, రేవతి, భారతి, రాజేశ్వరి, భాగ్య, అలాగే ఎస్ఎస్ఎంఎం ఎన్జీవో సిబ్బంది మమత, రోజా తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి తమ వంతు సేవలు అందించారు. ఈ విధమైన వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు.

## గణితం,విజ్ఞాన ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన స్లేట్ విద్యార్థులు

**జన్నారం, మార్చి 20, ప్రభాతవార్త**

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణితము, విజ్ఞాన శాస్త్రం ఒలంపియాడ్ 2025-26లో జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గణిత ఒలింపియాడ్‌లో స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని లావుడ్య సహస్ర రాష్ట్ర స్థాయి 4 వ ర్యాంక్, 2వ తరగతి విద్యార్థి ఇషాన్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్, సైన్స్ ఒలంపియాడ్‌లో 8వ తరగతి చెందిన ఆదిత్య రాష్ట్ర స్థాయి 1వ ర్యాంక్, అలాగే గణిత ఒలంపియాడ్‌లో స్లేట్ హైస్కూల్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థి శ్రీలౌకిక్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్, 3వ తరగతి విద్యార్థి దీక్షాశ్రీ రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు, విజ్ఞాన శాస్త్ర ఒలంపియాడ్‌లో హర్షిత్, షణ్ముఖ ప్రియా రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంకులు అంతేకాకుండా జిల్లా స్థాయిలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులు, కన్సోలేషన్ గ్రేడ్స్ సాధించినట్లు స్లేట్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు

- రెండు చోట్ల ఏకకాలంలో దాడి చేసి మూడు ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు
- ఇసుక దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం
- చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరిక

**చెన్నూరు, మార్చి 20, ప్రభాతవార్త**

అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపిన, ఇసుకను తరలించినా, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని సుబ్బరాంపల్లి, పొక్కూరు గ్రామాల్లో ఏకకాలంలో



దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ చెన్నూరు మండలంలోని సుబ్బరాంపల్లి వాగు సమీపంలోని ఒక ఫామ్ హౌస్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రాత్రి వేళలో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించామని తెలిపారు. మండలంలోని పొక్కూర్ సమీపంలోని గోదావరిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్ ను పట్టుకోగా మరో రెండు ట్రాక్టర్లు పరారీ అయినట్లు తెలిపారు. పట్టుబడిన మూడు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించినా, తవ్వకాలు జరిపినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చెన్నూరులో అక్రమ ఇసుక రవాణా జరగడం లేదని జిల్లా మైనింగ్ అధికారులు చెప్పినప్పటికీ పోలీసులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**చెన్నూరు, మార్చి 20, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ కొమ్మెర విజయలక్ష్మి బ్రహ్మయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు బెల్లంకొండ కర్ణసాగర్ రావ్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశానుసారం మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ,శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ కాలనీలోని సంఘం భవనం ముందు సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్ల చందర్, సుధాకర్ రెడ్డి, కరీం, నవీన్, సంఘం పెద్దలు కాసుల దక్షిణామూర్తి, శంకరయ్య, సురేష్, వేణు, కృష్ణమూర్తి, అకినపెల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

**జన్నారం, మార్చి 20, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సీదార్ల రామ్మోహన్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సీదార్ల ఉదయ్ కుమార్‌లు శుక్రవారం రోజు మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే డిక్షనరీలను పంపిణీ చేసిన వారిద్దరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్,శెట్టి రాజశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, నాగలక్ష్మి, గీత, స్వరూప, వెన్నెల, అంగన్వాడీ టీచర్లు స్వరూప, వనిత తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ తోఫా పంపిణీ

**జన్నారం, మార్చి 20, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న రంజాన్ తోఫాను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశానుసారం ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఇంచార్జి ఎమ్మార్వో రామ్మోహన్ చేతుల మీదుగా శుక్రవారం నాడు కవ్వాల్‌లో ముస్లిం సోదర సోదరీమణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పార్టీ నాయకులు, అధికారులు, ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# పక్షులను కాపాడితేనే ప్రకృతిని కాపాడినట్లవుతుంది

**- గుండేటి యోగేశ్వర్ - ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం - పర్యావరణ హిత జీవన విధానంపై అవగాహన**

**నస్పూర్, మార్చి 20, ప్రభాతవార్త**

పక్షులను కాపాడితేనే మనం ప్రకృతిని కాపాడినట్లవుతుందని పర్యావరణవేత్త, ప్రకృతి మిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్ పట్టణంలోని కలెక్టరేట్ రోడ్డులోని ప్రకృతి మిత్ర స్వచ్ఛంద సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతరించిపోతున్న పిచ్చుకల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. భూగోళం మీద ఉన్న ప్రతి పౌరుడు పర్యావరణానికి నష్టం కలిగించని జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో పిచ్చుకల కోసం అనువైన వాతావరణం కల్పించాలని యోగేశ్వర్ కోరారు. వేసవి కాలంలో పిచ్చుకల దాహం తీర్చేందుకు ఇంటి గోడలపై, ఖాళీ ప్రదేశాల్లో మట్టి పాత్రల్లో నీళ్లు, గింజలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక చెట్టు నాటితే అనేక పక్షులకు నివాసం కల్పించినట్లవుతుందని వివరించారు. ఈ సందర్భంగా వెదురు, కర్ర, గడ్డి, మట్టితో చేసిన పిచ్చుకల గూళ్లను ప్రదర్శించారు. పక్షుల కోసం ఏర్పాటు చేసిన మట్టి పాత్రలు, ఆహారమైన జొన్న గొలుసులు, ధాన్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



ప్లకార్డులు, మట్టి పాత్రలు, పిచ్చుక గూళ్లు, బట్ట సంచులను ప్రదర్శిస్తున్న దృశ్యం

పిచ్చుకల సంరక్షణకు సంబంధించి ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమానికి హాజరైన మంచిర్యాల నగర పాలక సంస్థ 11వ డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ పిచ్చుకలు ఉన్న చోట పరిసరాలు శుభ్రంగా ఉంటాయని తెలిపారు. పిచ్చుకలు హానికారక క్రిమి కీటకాలను తింటూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ మాట్లాడుతూ పిచ్చుకల రక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. వేసవిలో వాటికి తాగునీరు, ఆహారం అందించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణను శాలువాతో సన్మానించి పచ్చని మొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా కార్యాలయ ఏఓ పొన్న మల్లయ్య, న్యాయవాదులు అలేఖ్య, నటేశ్వర్ పాల్గొన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ గుల్లపల్లి శంకర్ లింగం, మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కిష్టయ్య, సినీ గేయ రచయిత అక్కల చంద్రమోళి, సంస్థ సభ్యులు మహేందర్, వంశీ, స్వర్ణ, శోభ, సునీత, రాధ, శరత్ చంద్ర, రాజశేఖర్, కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :**

సూర్యాపేట జిల్లాలో ఈ నెల24వ తేదీన నిర్వహించే సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర మహాసభలను ఆర్టిఐ కార్యకర్తలు, సొసైటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు వంగరి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాగజ్ నగర్ మండల కేంద్రంలో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 ఐదవ రాష్ట్ర మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ ఐదవ రాష్ట్ర మహాసభలు సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులు, ఆర్టిఐ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విస్తృతంగా చర్చించి, అట్టి సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం, అధికారుల వద్దకు తీసుకువెళ్లి, రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం మరింత బలోపేతంగా అమలు కావడానికి నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి కృషి చేయడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

## రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపు

**పెంచికల్‌పేట్, మార్చి 20, ప్రభాతవార్త :**



పెంచికల్‌పేట్ మండలంలో నేడు నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గోండ్వానా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్ శుక్రవారం మోర్లిగూడ గ్రామపంచాయతీ జిల్లెడ గ్రామంలో కొమరం భీం విగ్రహం వద్ద నిర్వహించిన కోయ సంక్షేమం సంఘం సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్క కులోన్మాద హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరపాలనే ప్రధాన డిమాండ్ తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుదాస్, ఎర్రయ్య, సుబ్బారావు, నాగయ్య శ్రీకాంత్, బాపు, కోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా వద్ద రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ కోడప ప్రకాష్

**జైనూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించనున్న రంజాన్ పండుగ ప్రార్థనల కోసం జైనూర్ మండల కేంద్రంలోని ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోడప ప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. ముస్లిం సోదరులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు చేసుకునేలా చేపట్టిన పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పండుగ వేళ ఈద్గా వద్ద మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏర్పాట్లపై అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జమీల్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు షేక్ రహీం, నాయకులు హసన్, షాకిర్, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ ప్రార్థనల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ కోడప ప్రకాష్



## గడప గడపకు కాంగ్రెస్.. సంక్షేమ పథకాలపై ప్రజల మధ్య ప్రచారం

### ముున్సిపాలిటీ 24 వార్డుల్లో కొనసాగింపు

**మందమర్రి, మార్చి 20, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయాలనే లక్ష్యంతో మందమర్రి పట్టణ కాంగ్రెస్ నాయకులు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఆకారం రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని 19వ వార్డులో చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంపై వివరాలు సేకరించారు. రెండు రోజుల్లోగా తమకు అవసరమైన సమాచారం అందించాలని 19వ వార్డు ప్రజలను కోరిన నాయకులు, ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని మొత్తం 24 వార్డుల్లో కొనసాగించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అందని అర్హులకు ప్రత్యేకంగా మంత్రి స్థాయిలో చర్చించి వాటిని అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ పుల్లూరి లక్ష్మణ్, మంకు రమేష్, ఏటూరి సత్యనారాయణ, నెరువట్ల శ్రీనివాస్, గుడ్ల రమేష్, బత్తుల రమేష్, హఫీజ్, జమీల్, పైడిమల్ల నర్సింగ్, మంద తిరుమల్, ఎర్ర రాజు, సంగి సదానందం, గుంట శ్రీశైలం, మాయ తిరుపతి, సుకూర్, దుర్గం ప్రభాకర్, రాకం సంతోష్, ముదారపు శేఖర్, రాయబారపు కిరణ్, చిప్పకుర్తి శశిధర్, ఏదుకోల పవన్, కనకం రాజు, అంకం రాజ్ కుమార్, కత్తి రమేష్, జంగపెల్లి రాజేష్, తాడవేణి కనకయ్య, డాక్టర్ లింగన్న, జక్కుల తిరుపతి, బొంగోని కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, మార్చి 20, ప్రభాతవార్త

జనగణన2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికారి పాపయ్య, ఉపగణాంక అధికారి, అదనపు జనగణన అధికారి రాజేందర్ లతో కలిసి మండల ప్రణాళిక గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులకు జనగణన ప్రక్రియ, యాప్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని, ఈ తరుణంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, ఏప్రిల్ మొదటి వారం నుండి సన్నాహక పనులు జరుగుతాయని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మండల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్ / అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షకులు నేర్పించే అంశాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, శిక్షణలో పొందిన అవగాహనతో క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్‌కు అభినందనలు

**- శాలువాతో సత్కరించిన సట్ల సంతోష్ గౌడ్**

**- కార్యకర్తల కష్టానికి గుర్తింపు ఉంటుందన్న వెంకట్**

మందమర్రి, మార్చి20, ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.సి, ప్రభుత్వ విప్‌గా నియమితులైన డాక్టర్ బల్మూరి వెంకట్‌ను మందమర్రి పట్టణానికి చెందిన మాజీ యువజన కాంగ్రెస్ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు సట్ల సంతోష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తప్పకుండా గుర్తింపు ఇస్తుందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ భేటీ సందర్భంగా నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

**- ముఖ్యమంత్రికి నస్పూర్ రైతుల లేఖలు**

**- మూడు విడతల బకాయిల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన**

నస్పూర్, ప్రభాతవార్త



కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిన మూడు విడతల రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నస్పూర్ పట్టణ పరిధిలోని రైతులు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. శుక్రవారం సీసీసీ పోస్ట్ ఆఫీస్ వద్ద నస్పూర్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. నస్పూర్, సీతారాంపల్లి, తాళ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ డిమాండ్లతో కూడిన సంతకాల లేఖలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపారు. పోస్ట్ ఆఫీస్ ముందున్న పోస్ట్ బాక్సులో ఈ లేఖలను వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మేరుగు పవన్ కుమార్, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, నాయకులు వంగ తిరుపతి, జగ్గయ్య, జనార్ధన్, భీమయ్య, ఆకునూరి సంపత్, రుకుం తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ సభ్యులకు ఘనంగా సన్మానం

**- మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్**



భైంసా, మార్చి 20, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా ఎంపికైన సభ్యులను ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి ఎన్నికైన సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం భోస్లే నారాయణరావు పాటిల్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి జిల్లా కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ పార్టీకి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

## షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఈ సందర్భంగా కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సమస్యలకు గురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, అధ్యాపకులు, షీ టీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల లోబడి ఆర్.కె 6 గని మూసివేత పనులు జరగాలి

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, మర్చి 20, ప్రభాతవార్త

కేంద్ర బొగ్గు గనుల శాఖ నిబంధనలకు లోబడి ఆర్.కె 6 గని ఫైనల్ మైన్ క్లోజర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన బొగ్గు ఉత్పత్తి నిలిచిన ఆర్.కె 6 గని ప్రాంగణంలో పర్యావరణ పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైనింగ్ ముగిసిన తర్వాత పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా సాధారణ పరిస్థితులను కల్పించడమే ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశం. గని పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా పాత స్థితికి తెచ్చేలా సాగుతున్న కార్యక్రమాలను ఆయన గమనించారు. కేంద్ర బృందం తనిఖీ నాటికి పనులు పూర్తి చేసి డిపాజిట్ నిధులు సంస్థకు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గుంతల మయమైన రోడ్డు మరమ్మతులు చేయాలి

మందమర్రి రూరల్, మార్చి 20 ప్రభాతవార్త :

*ఆదిలిపేట-ఆవడం ప్రధాన రహదారి దయనీయ స్థితికి చేరుకుంది. ఇటీవలే వేసిన ఈ తారు రహదారి కాంట్రాక్టర్ నిరక్ష్యం, నాసిరకం పనుల కారణంగా కొద్దికాలంలోనే పగుళ్లు పడి గుంతలమయమైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దుబ్బపల్లి సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తుర్కపల్లి, సారంగపల్లి, చిర్రకుంట, ఆదిలిపేట, పున్నారం తదితర గ్రామాల నుంచి మందమర్రికి కూరగాయల వ్యాపారం కోసం రైతులు తండోపతండాలుగా వస్తుంటారు. ఈ రహదారే వారికి ప్రధాన మార్గం కావడంతో, రోడ్డు దుస్థితి వారి రాకపోకలకు ఆటంకంగా మారింది.కొత్తగా వేసిన తారు రోడ్డు ఇంత త్వరగా దెబ్బతినడం పనుల నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. రహదారిపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.*



గుంతలమయమైన రోడ్డు